క్లుప్తంగా

ఏపీపీఆర్ పింఛన్ దారుల సంఘం కార్యవర్గం

కాకినాడ రూరల్: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ పింఛనుదారుల సంక్షేమం సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చల్లా కల్యాణ మంటపం వద్ద సోమవారం రిటైర్డ్ ఈఈ పీఆర్ అండ్ ఆర్డీ ఎం.రాఘవులు అధ్యక్షతన జరిగిన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో కార్యవర్గ అధ్యక్షుడిగా ఎండీ సీహెచ్ సంధాని, కార్యదర్శిగా జేఎస్వీ రమణరావు, కోశాధికారిగా పట్టాభిరామయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా వెంకటేశ్వరరావు, కనకదుర్గ, యజ్ఞనారాయణ, సంయుక్త కార్యదర్శిగా సాంబమూర్తి, సభ్యులుగా ఆంజనేయులు, సత్యనారాయణ, శాస్త్రి, భగవాన్, దేవరపల్లి సత్యనారాయణ, సూర్యనారాయణ, జగన్నాధరావు, నూకరాజు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా రాఘవులు, రామారావు వ్యవహరించారు.

డాక్టర్ అడ్డాలకు రాష్ట్ర స్థాయి ఐడీఏ పురస్కారం

బోట్‌క్లబ్: విజయవాడలో సోమవారం జరిగిన ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర సమావేశాల్లో కాకినాడకు చెందిన దంత వైద్యులు అడ్డాల సత్యనారాయణకు ఉత్తమ దంత వైద్య సేవలకు రాష్ట్ర స్థాయి పురస్కారం లభించింది. అడ్డాల మాట్లాడుతూ ఈ పురస్కారం అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. పురస్కారం రావడానికి సహకరించిన గురువులకు, మిత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పలుచోట్ల అన్నదానాలు

బోట్‌క్లబ్: గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నగరంలో వివిధ ప్రాంతాల్లో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అన్నదానాలు నిర్వహించారు. దీనిలో భాగంగా గాంధీనగర్ రైతు బజార్‌లో రైతులు, వ్యాపారులు అన్నదానం చేశారు. అన్నదానం కార్యక్రమాన్ని ఎస్టేట్ అధికారి శివ ప్రారంభించారు. సుమారు 6 వేల మంది అన్నదానం స్వీకరించారు. స్థానిక దంటు వారి వీధిలో గణేశ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని దూసర్లపూడి రమణరాజు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నగరంలో ఏటేటా గణపతి ఉత్సవాలు పేరిట నాలుగు లక్షలు మందికి అన్న సంతర్పణలు జరుగుతున్నాయన్నారు.

కలెక్టరుకు మట్టి కలశం అందజేత

కాకినాడ సిటీ: విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించి, మన దేశ స్వాతంత్య్ర సమరయోధుల గొప్పదనాన్ని, వారి త్యాగాలను తెలుసుకోవడానికి మేరీ మిట్టీ–మేరా దేశ్ కార్యక్రమం దోహదం చేస్తుందని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మేరీ మిట్టీ–మేరా దేశ్ కార్యక్రమాన్ని గతనెల 25 నుంచి 29 వరకు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నిర్వహించినట్లు తెలిపారు. 21 మండలాల నుంచి మట్టిని సేకరించారన్నారు. సేకరించిన ఈ మట్టిని పవిత్ర కలశంలో నింపి జిల్లా విద్యాశాఖాధికారి, సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయ కర్త, జోన్–2 రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి నాగమణి, ఎన్‌సీసీ విద్యార్థులు కలిసి కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్‌కు అందజేశారు. పవిత్రమైన మట్టిని రాష్ట్ర స్థాయికి పంపిస్తామని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి ఎమ్‌వీ రామారెడ్డి, ఎన్‌సీసీ విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలను పెంచాలి

కాకినాడ సిటీ: ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలను పెంచాలని కాకినాడ రైల్వే స్టేషన్ మేనేజర్‌కు కాకినాడ జిల్లా ఏఐవైఎఫ్ నేతలు సోమవారం వినతి పత్రం అందజేశారు. కరోనా కారణంగా పాసింజర్ రైళ్లు నిలిపివేశారని, తర్వాత తిరిగి ప్రారంభం కావడం లేదని పేర్కొన్నారు. కేవలం ఎక్స్‌ప్రెస్ రైళ్లే తిరగడంతో తక్కువ జనరల్ బోగీలు ఉన్నాయన్నారు. దీనివల్ల పేద ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని రైల్వే శాఖ అధికారులకు అందజేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వై.బాబీ, సూరంపూడి నాని, ఎస్.స్వామి పాల్గొన్నారు.

తపాలా దినోత్సవం

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ తపాలా దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. తపాలా శాఖ సహాయ సూపరింటెండెంట్ అవసరాల శ్రీనివాసరావు, ప్రధాన తపాలా శాఖ పోస్ట్‌మాస్టరు అమ్మిరాజు, సహాయ పోస్ట్ మాస్టరు ప్రసాదరావు, విశ్రాంత పోస్టుమాస్టరు సూర్యారావును అడబాల రత్న ప్రసాద్ సన్మానించారు. తపాలా శాఖ సహాయ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, బుద్ధరాజు సత్యనారాయణరాజు, చింతపల్లి సుబ్బారావు, శ్రీనగేష్, అడబాల సత్యనారాయణ, రాజు పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలని వినతి

కాకినాడ సిటీ: కరప మండలం కొంగోడు గ్రామంలో 20 ఏళ్లుగా దేవుని సువార్త చేసుకుంటున్నానని అయితే ఇటీవల అదే గ్రామానికి చెందిన పెంకే గోవిందు కులం పేరుతో దూషిస్తున్నాడని సింగంపల్లి రామలక్ష్మి సోమవారం కలెక్టర్ కృతికా శుక్లాకు ఫిర్యాదు చేశారు. మూడేళ్లుగా అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని, రక్షణ కల్పించాలని కలెక్టర్‌ను కోరినట్లు రామలక్ష్మి వివరించారు.

హు.. హ్హా..లో అదరహో!

కరాటే పోటీల్లో పతకాలు సాధిస్తున్న బాలభవన్ విద్యార్థులు



బాలభవన్‌లో కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థులు

బోట్‌క్లబ్: వారంతా సామాన్య కుటుంబాలకు చెందిన బాలికలు. తమకిష్టమైన కరాటే క్రీడల్లో రాణించాలని కలలుగన్నారు. వాటిని నిజం చేసుకునేందుకు నిత్యం శ్రమిస్తూనే ఉన్నారు. చదువుతోపాటు కరాటే సాధన రోజువారీ కార్యక్రమాల్లో భాగంగా మార్చుకున్నారు. వీరంతా బాలభవన్‌లో కేవలం రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 50 నామ మాత్రపు రుసుంతోనే సాధన చేస్తూ పతకాలు పంట పండించడం విశేషం. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన అంతర్జాతీయ దక్షిణ భారత రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో 30కిపైగా బంగారు, 28 రజత , 25 కాంస్య పతకాలు సాధించి బాలభవన్ విద్యార్థులు కరాటేలో ఔరా అనిపించుకొంటున్నారు. బాలభవన్‌లో కరాటేతోపాటు సంగీతంలోను ఉచిత శిక్షణ ఇస్తున్నారు.

చిత్రలేఖనంలోనూ..



తనకు వచ్చిన పతకాలు చూపుతున్న సామిక

స్థానిక గాంధీనగర్‌కు చెందిన కేఎస్ఎస్ సామిక 5వ తరగతి చదువుతోంది. తండ్రి హరికృష్ణ పీఆర్ కళాశాల్లో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. 2020 నుంచి బాలభవన్‌లో శిక్షణ పొందుతోంది. సామిక కరాటేతోపాటు చిత్రలేఖనంలోనూ రాణిస్తోంది. గత సంవత్సరం అమలాపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించింది. విశాఖలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో రెండు విభాగాల్లో బంగారు, రజత పతకాలు సాధించింది. ఈ ఏడాది విశాఖలో జరిగిన దక్షిణ భారత స్థాయి పోటీల్లో రజత, కాంస్య పతకాలు సాధించింది. భవిష్యత్‌లో కరాటేలో రాణించి వైద్యురాలు కావాలన్నది తన ధ్యేయమంటోంది ఈ బాలిక.

ఉచిత శిక్షణ ఇస్తున్నాం



ప్రతీ రోజు మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకూ శిక్షణ ఉంటుంది. ఆదివారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ శిక్షణ ఇస్తున్నాం. ఈ శిక్షణ ఉచితం. ప్రతీ శుక్రవారం సెలవు. ప్రస్తుతం 400 మంది చిన్నారులు ఇక్కడ అడ్మిషన్లు పొందారు. ప్రతీ రోజు 100 మందిపైగా పిల్లలు వారికి ఇష్టమైన రంగంలో శిక్షణ పొందుతున్నారు.

– ఎ.శారద, బాలభవన్ సూపరింటెండెంట్

కరాటేలో రాణిస్తున్న హారిక



పతకాలు చూపుతున్న హారిక

కాకినాడ ఇంద్రపాలేనికి చెందిన నీలి శ్రీ వీర హారిక ప్రస్తుతం శ్రీ నగర్ మున్సిపల్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతోంది. తండ్రి చిన్నారావు, తల్లి నాగలక్ష్మి ఇంటి వద్ద చిన్న హోటల్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. బాల భవన్‌లో ఉచితంగా కరాటే వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారని తెలిసి తమ కుమార్తెను 2021లో అక్కడ చేర్పించారు. హారిక కరాటేలో చూపుతున్న ప్రతిభను గమనించి కరాటే మాస్టర్ మరింత ప్రోత్సహించారు. 2022లో సామర్లకోటలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లోను, విశాఖలో జరిగిన పోటీల్లోను రజత పతకాలను గెలుచుకుంది. ఈ ఏడాది విశాఖలో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో బంగారు, రజత పతకాలు సాధించింది. ఇటీవల రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండు విభాగాల్లో బంగారు, కాంస్య పతకాలు సాధించింది. కరాటే అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే తన ధ్యేయమని హారిక తెలిపింది.

త్రైక్వాండో పోటీలలో శ్రీనిధికి బంగారు పతకం



నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా త్రైక్వాండో సంఘం ఆధ్వర్యంలో కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి త్రైక్వాండో పోటీలలో కాకినాడకు చెందిన వి.హేమశ్రీనిధి ప్రతిభను కనబరచి బంగారు పతకం గెలుచుకుంది. ఓవర్ 59 కేజీల విభాగంలో పాల్గొన్న శ్రీనిధి ఐదు సంవత్సరాలుగా త్రైక్వాండోలో శిక్షణ పొందుతోంది. ఇప్పటి వరకు మూడు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని 5 బంగారు, ఒక రజత, ఒక కాంస్య పతకం సాధించింది. కడపలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు 4వ సారి ఎంపికయ్యింది. స్థానిక విద్యుత్ నగర్‌లోని ఒక ప్రైవేటు స్కూల్‌లో శ్రీనిధి 9వ తరగతి చదువుతోంది.

సమస్యల సత్వర పరిష్కారానికే స్పందన

కాకినాడ: ప్రజలు ఎదుర్కొనే స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించేందుకే ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు చెప్పారు. స్పందనలో ప్రజల నుంచి వచ్చే ప్రతి ఒక్క దరఖాస్తుకు నాణ్యమైన పరిష్కారాన్ని అందిస్తామని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి వివిధ అంశాలపై 19 మంది దరఖాస్తులు అందజేశారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి 10 దరఖాస్తులు వచ్చాయి. వీధి దీపాలు, రహదారులు, డ్రైనేజీల నిర్మాణం, టౌన్ ప్లానింగ్, టిడ్కో గృహ నిర్మాణ అంశాలపై ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను కమిషనర్ స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న అధికారులను కమిషనర్ ఆదేశించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా దరఖాస్తులు అందజేయవచ్చునని సూచించారు. డీసీపీ హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, పలువురు డీఈలు, ఏఈలు, సూపరింటెండెంట్లు, వివిధ విభాగాల అధికారులు హాజరయ్యారు.

కాన్షీరాంకు నివాళులు

కాకినాడ సిటీ: దళిత, గిరిజన, బీసీ, ముస్లిం క్రైస్తవ ఐక్యవేదిక, డీబీఎం యూత్ ఆధ్వర్యంలో కాకినాడ జగన్నాథపురం ముగ్గుపేటలో కాన్షీరాం 17వ వర్ధంతి సభను సోమవారం నిర్వహించారు. అధ్యక్షులు డోకుబుర్ర భద్రం, షేక్ హుస్సేన్, బాలభద్రరావు, సుధాకర్, సలగాల విజయకుమార్, కండవల్లి డేవిడ్‌రాజు, ఆవుపాటి ఉమాశంకర్ పాల్గొని కాన్షీరాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మెరుగైన వైద్య సేవల కోసమే ఆరోగ్య సురక్ష



రోగులకు కిట్లు పంపిణీ చేస్తున్న కమిషనర్ నాగనరసింహారావు



శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఎంపీడీఓ స్వప్న



దివ్యాంగుడి వద్దకు వచ్చి ఆరోగ్య సమస్యలు తెలుసుకుంటున్న వైద్యాధికారి శ్రీనివాసనాయక్

కాకినాడ: ప్రజలకు చేరువగా మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతోనే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిందని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు చెప్పారు. స్థానిక సాంబమూర్తినగర్‌లో 8, 13 డివిజన్లకు సంబంధించి సోమవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో కమిషనర్ పాల్గొన్నారు. అక్కడ అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. వివిధ వైద్య పరీక్షలకు ఎంపికైన రోగులకు కమిషనర్ కిట్లు పంపిణీ చేశారు. శిబిరానికి వచ్చిన రోగులకు బీపీ, చక్కెర వ్యాధి, కంటి వైద్యంతో పాటు వివిధ ఆరోగ్య సమస్యలకు సంబంధించి నిర్ధారణ పరీక్షలు చేశారు. కమిషనర్ నాగ నరసింహారావు మాట్లాడుతూ ప్రజల వద్దకే వెళ్లి... ఆరోగ్య సమస్యలు తెలుసుకుని మెరుగైన వైద్య సేవలు అందించాలనే వినూత్న కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రజలకు ఎంతో ప్రయోజనాన్ని చేకూరుస్తుందని, ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాకినాడ కార్పొరేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఇతర వైద్య సిబ్బంది ఇళ్ల వద్దకే వచ్చి సర్వే చేస్తున్నారని వీరికి ప్రజలంతా సహకరించాలని కమిషనర్ కోరారు. నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, టౌన్‌ప్లానింగ్ సూపరింటెండెంట్ శాస్త్రి, స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు చిట్నీడి మూర్తి, ఎండీ అస్గర్, సత్య, పెంకే రవి, చిట్నీడి సత్తిరాజు, రాయుడు వాసు, గుత్తుల సత్యవతి పాల్గొన్నారు.

శిబిరంలో సేవలు

కాకినాడ రూరల్: రమణయ్యపేట గ్రామంలో సచివాలయం – 5 పరిధిలోని ప్రజలకు ఏపీఎస్పీ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పండూరు పీహెచ్‌సీ వైద్యురాలు ఆయేషా ఫాతిమా, సిబ్బంది, స్పెషలిస్టు వైద్యులు శిబిరానికి హాజరైన 435 మందికి వైద్య సేవలందించారు. ఉచితంగా మందులు అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు పోషకాహార స్టాల్‌ను ఏర్పాటు చేశారు. డీఎల్‌డీఓ నారాయణరావు, ఎంపీడీఓ కర్రే స్వప్న శిబిరాన్ని సందర్శించారు. ఈఓ పీఆర్ అండ్ ఆర్డీ రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ పాల్గొన్నారు.

పెనుగుదురులో..

కరప: ప్రజల చెంతకే వైద్యసేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలం పెనుగుదురులో సోమవారం గ్రామసర్పంచ్ రెడ్డిపల్లి వెంకటమాధవి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో ఆయన మాట్లాడారు. ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకుని, వారికి మెరుగైన వైద్యసేవలందించేందుకు ప్రజాప్రతినిధులతో కలసి ప్రభుత్వాధికారులు, వైద్యసిబ్బంది సమష్టిగా పనిచేస్తున్నారన్నారు. పెనుగుదురు గ్రామసచివాలయం–1 పరిధిలో 456 మంది జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరానికి వచ్చి, పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాసనాయక్, డాక్టర్ పి.ఆశ తదితర వైద్యనిపుణులు పేషెంట్లను పరీక్షించి, మందులు రాసిచ్చారు. కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లజోళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. శిబిరం వద్దకు వచ్చిన దివ్యాంగుల వద్దకెళ్లి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, నాయకులు కల్సి పేషెంట్లకు మందులకిట్లను అందజేశారు. పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రెడ్డిపల్లి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు బండారు వెంకటేశ్వరరావు, సతీష్, ఎంపీడీఓ కె.అప్పారావు, ఎంఈఓ–2 పి.సత్యనారాయణ, గ్రామకార్యదర్శి బి.చంద్రకళ, వీఆర్వో ఆదినారాయణ పాల్గొన్నారు.

అధినేతతో మాటామంతీ



విజయవాడలో సోమవారం జరిగిన వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశంలో వేదికపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

సీఎం పర్యటన సక్సెస్ చేయండి

కాకినాడ: నిర్మాణం పూర్తి చేసుకున్న జగనన్న కాలనీలను ప్రారంభించేందుకు ఈ నెల 12న సామర్లకోట విచ్చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను సక్సెస్ చేసే అంశంపై ఆయా విభాగాల అధికారులు దృష్టి పెట్టాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు కోరారు. స్మార్ట్‌సిటీ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక అధికారులు, నోడల్ ఆఫీసర్లు, మెప్మా సిబ్బంది, ఆర్పీలతో పర్యటనపై కమిషనర్ నాగ నరసింహారావు సమావేశమయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 33లక్షల మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే ప్రక్రియకు నాలుగేళ్ల క్రితం కాకినాడ జిల్లా నుంచే సీఎం జగన్ శ్రీకారం చుట్టారన్నారు. కేటాయించిన స్థలాల్లో సకల సదుపాయాలు, మౌలిక వసతులతో వేగంగా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఈ క్రమంలో జగనన్న కాలనీలను ఈ జిల్లా నుంచే ప్రారంభించేందుకు సీఎం ఇక్కడికి వస్తున్నారన్నారు. సామర్లకోటలో ఈ నెల 12వ తేదీన సీఎం పాల్గొనే సభకు కాకినాడ ప్రాంత గృహ నిర్మాణ లబ్ధిదారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని సూచించారు. ఆ మేరకు ఆయా విభాగాలు సీఎం సభను విజయవంతం చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కమిషనర్ కోరారు. నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, ఆర్పీలు, ఆయా విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగుల ఆందోళన

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సహేతుకమైన పోస్టల్ ఉద్యోగుల డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆల్ ఇండియా పోస్టల్ ఎంప్లాయీస్ గ్రూప్–సి పోస్ట్‌మాన్ ఎంటీఎస్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు కాకినాడ హెడ్‌పోస్టాఫీస్ ఎదుట సోమవారం భోజన విరామ సమయంలో ఆందోళన చేశారు. ఏపీ సర్కిల్‌లో మూసివేసిన 10 పోస్టాఫీసులను వేరొక ప్రాంతంలో ఏర్పాటు చేయాలని, రిటైర్డ్ ఉద్యోగులకు రావలసిన ప్రయోజనాలను త్వరగా చెల్లించాలని, కార్యాలయంలో ఉపయోగించే సిస్టమ్స్, ప్రింటర్స్, యూపీఎస్ కొత్తవి ఏర్పాటు చేయాలని, ఇంటర్ సర్టిఫికెట్ సబ్‌మిట్ చేయనికారణంగా పెండింగ్‌లో ఉంచిన అన్ని సీఈఏ బిల్లులను పాస్ చేయాలని కోరారు. యూనియన్ నాయకులు జి.అనితకుమారి, పి.సాగర్, ఆర్.వి.వి.ఎస్.ఎస్.మూర్తి, కె.ప్రసాదరావు, కె.శ్రీనివాసరావు, డేగల శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఉద్యోగుల డిమాండ్‌కు ఆల్ ఇండియా పోస్టల్–ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ డివిజనల్ కార్యదర్శి తురగా సూర్యారావు మద్దతు తెలిపారు.

ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి



సుస్వరాలలో ఆలపిస్తున్న గాయకులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): స్థానిక సూర్యకళా మందిరంలో సోమవారం రాత్రి కాకినాడ మ్యూజికల్ గ్రూపు ఆధ్వర్యంలో గాయకులు ఆలపించిన సంగీత విభావరి నగర ప్రజలను ఉర్రూతలూగించింది. అలనాటి మధురగీతాలైన ప్రేమాభిషేకం సినిమాలోని నా కళ్లు చెబుతున్నాయి నిన్ను ప్రేమించానని, యమలీల చిత్రంలోని నీ జీనుప్యాంట్ చూసి బుల్లెమ్మో, నోము చిత్రంలోని కురిసే కళ్లలోని వంటి హిట్ పాటలు పాడడంతో సభాప్రాంగణం చప్పట్లతో దద్దరిల్లిపోయింది. గాయకులు జీఎస్‌జె కుమార్, బి.వెంకన్నబాబు, వి.రామారావు, ఎస్వీ రమణ, బి. సీతారామరాజు, వి.వీరమణి, సీహెచ్ మనోహరి, సురభి సుశీల ఆలపించిన పలు గీతాలు ఆకట్టుకున్నాయి. కుర్రకారు లేచి స్టెప్పులేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్వీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ యమలీల సినిమాలోని పాటలు ఎప్పుడు విన్నా ఎంతో ఆనందాన్ని ఇస్తాయన్నారు. యమలీల సినిమాలో సూపర్‌స్టార్ కృష్ణ ప్రత్యేకంగా ఒక సాంగ్ చేయడంతో ఆ సినిమా మరింత హిట్ అయ్యిందన్నారు. సినిమా పరిశ్రమలో కృష్ణ అంతటి గొప్ప నటుడుని చూడలేదన్నారు. యమలీల సినిమాలోని నీ జీన్ ఫ్యాంట్ సాంగ్‌కు 75 సంవత్సరాలు వయస్సు వచ్చినా అల్లురామలింగయ్య సైతం డాన్స్ వేసేవారన్నారు. ఆయన తనను ఎక్కడ చూసినా ఈ పాటలకు డాన్స్ వేయడం నాకు ఆశ్చర్యం కలిగించేదన్నారు. నా భవిష్యత్ గొప్ప అదృష్టం ఏమిటంటే మా అల్లుడు మా అమ్మాయిని ఎంతో బాగా చూసుకోవడమే అన్నారు. యమలీల చిత్రంలోని పాటలు మా అమ్మాయికి అంకితమిస్తున్నట్లు చెప్పారు.

ఈవీఎంల పరిశీలనకు సంసిద్ధం కావాలి

కాకినాడ సిటీ: ఈ నెల 16వ తేదీ నుంచి కాకినాడ అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించనున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల మొదటి స్థాయి పరిశీలన ఏర్పాట్లను ఆర్‌డీవో ఎస్వీ సత్యనారాయణ పర్యవేక్షించారు. ఈ నెల 16వ తేదీ నుంచి అంబేడ్కర్ భవన్‌లో రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పరిశీలనకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు ముమ్మరం చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ సీతాపతిరావు, ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి వరహాలయ్య పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

కాకినాడ లీగల్: కోర్టులో దాఖలు చేసే ప్రతి పిటిషన్‌పై అదనంగా రూ.20 అడ్వకేట్ వెల్ఫేర్ స్టాంప్ అతికించాలని నిర్ణయం తీసుకోవడం అన్యాయమని కాకినాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులు అన్నారు. సోమవారం స్థానిక బార్ అసోసియేషన్ వద్ద న్యాయవాదులు విధుల బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. బార్ కౌన్సిల్ ఆ నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ముత్తింటి విశ్వేశ్వరరావు, చెక్కా శ్రీనివాస్ కోరారు.

కలెక్టర్‌కు మహిళా న్యాయవాది ఫిర్యాదు

కాకినాడ సిటీ: నా సొంత స్థలంలో ప్రహరీ కట్టుకుంటుంటే కొందరు వ్యక్తులు కక్షతో దానిని కూల్చివేసి నన్ను అనేక రకాలుగా వేధింపులకు గురి చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలంటూ సామర్లకోట బలుసులపేటకు చెందిన న్యాయవాది జంగం సంతోషకుమారి సోమవారం కలెక్టర్ కృతికా శుక్లాకు ఫిర్యాదు చేశారు.